క్లుప్తంగా

జాతీయ స్థాయి కయాకింగ్ పోటీలకు పెనుమాక విద్యార్థి



తాడేపల్లిరూరల్: జాతీయ స్థాయి కానోయింగ్, కయాకింగ్ పోటీలకు పెనుమాక వందేమాతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయుడు వి.పూర్ణ చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు భోపాల్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి సబ్ జూనియర్, జూనియర్ కానోయింగ్, కయాకింగ్ పోటీల్లో 9వ తరగతి విద్యార్థి పి.ఆర్యచరణ్ పాల్గొనున్నట్లు చెప్పారు. జూనియర్ 200, 500 మీటర్ల కయాకింగ్ ఈవెంట్లకు అర్హత సాధించినట్లు వివరించారు. పాఠశాల ఉపాధ్యాయులు ఆర్యచరణ్‌కు రూ.6వేల పారితోషకాన్ని అందజేశారు. వ్యాయామ ఉపాధ్యాయుడు బి.రమేష్, హరికృష్ణను అభినందించారు.

ఉర్దూ పాఠశాల తనిఖీ

మేడికొండూరు: మండల పరిధిలోని తురకపాలెంలోని మండల పరిషత్ ఉర్దూ పాఠశాలను ఉప తనిఖీ అధికారి ఎం.డి.ఖాసిం సోమవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థులను సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాలలో పలు రికార్డులు పరిశీలించారు.

232 రిజిస్ట్రేషన్లు పూర్తి

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని జగనన్న కాలనీ ఐదు లేఅవుట్లలో 620 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ పూర్తి చేసినట్లు పంచాయతీ ఇన్‌చార్జి ఏఓ కె.విష్ణువర్ధన్‌రావు తెలిపారు. ఇళ్ల పట్టాలు ఉన్న లబ్ధిదారులకు ఆయా సచివాలయాల్లో ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు.

ధ్యానంతో ఆత్మవిశ్వాసం

ఫిరంగిపురం: ప్రతి ఒక్కరూ ధ్యానం చేయడం ద్వారా ఆత్మవిశ్వాసం పొందవచ్చునని పిరమిడ్ మాస్టర్ పి.లక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని విశ్వశాంతి పాఠశాలలో వారం రోజులుగా పిరమిడ్ ధ్యానం పై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కాగా సోమవారం శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మహేంద్రరెడ్డి పాల్గొన్నారు.

సీపీఎం, సీపీఐ నేతలపై కేసు కొట్టివేత

తాడేపల్లిరూరల్: సీపీఎం, సీపీఐ నేతలపై పెట్టిన కేసును కొట్టివేస్తూ మంగళగిరి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి.శ్రీప్రత్యూష సోమవారం తీర్పు నిచ్చారు. ఆ పార్టీల నాయకులు ఎం.రవి, డి.వెంకట రెడ్డి, కంచర్ల కాశయ్య మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో 2018లో తాడేపల్లి పోలీసులు వివిధ సెక్షన్ల కింద తమపై కేసు నమోదు చేశారని, సాక్ష్యాధారాలు లేకపోవడంతో కేసును కొట్టివేశారని చెప్పారు.

జోసిల్‌లో మాక్ డ్రిల్



మేడికొండూరు: మండల పరిధిలోని జోసిల్ పరిశ్రమలో అత్యవసర పరిస్థితులను ఏవిధంగా అధిగమించాలో ఎన్డీఆర్ఎఫ్ బృందం ఆధ్వర్యంలో సోమవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. క్లోరిన్ గ్యాస్ లీక్ అవుతున్న పరిస్థితి ఏవిధంగా అధిగమించాలో ప్రాక్టికల్‌గా ఎన్డీఆర్ఎఫ్ బృందం చూపించారు. జోసిల్ పరిశ్రమ సిబ్బందితో ప్రాక్టికల్ చేయించారు. కెమికల్ డిజాస్టర్ కింద జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి ఆదేశాల మేరకు డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీ శివకుమార్ పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో జిల్లా ఫైర్ అధికారి శ్రీధర్‌బాబు, ఎన్డీఆర్ఎఫ్ కమాండెంట్ భూపేంద్రకుమార్, భద్రతా అధికారి సుజిత్, జోసిల్ కంపెనీ సెక్రటరీ కోటా రఘురామ్, ప్రొడక్షన్ అడ్వైజర్ రామినేని బెనర్జీబాబు, యడ్లపాటి భానుప్రసాద్ పాల్గొన్నారు.

మహిళపై లైంగిక దాడి

గుంటూరు ఈస్ట్: ప్రేమిస్తున్నానని చెప్పి మహిళపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. నేతాజీనగర్‌కు చెందిన నాగరాజు అదే ప్రాంతానికి చెందిన మహిళతో రెండేళ్లుగా ప్రేమ వ్యవహారం నడిపి లైంగిక దాడి చేశాడు. ఆమె గర్భం దాల్చడంతో అబార్షన్ చేయించాడు. బాధిత మహిళ పెళ్లి చేసుకోమని కోరగా, నిరాకరించాడు. సోమవారం బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళల అభ్యున్నతే సీఎం జగన్ లక్ష్యం

- ఎమ్మెల్యే, తాడికొండ సమన్వయకర్త మేకతోటి సుచరిత
- తుళ్లూరులో పండగ వాతావరణంలో ఆసరా చెక్కుల పంపిణీ
- హాజరైన జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి



మహిళలకు చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి

తాడికొండ: మహిళాభ్యున్నతే లక్ష్యంగా సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే, మాజీ హోం మంత్రి, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త మేకతోటి సుచరిత తెలిపారు. మండల కేంద్రమైన తుళ్లూరులోని మేరీ మాత హైస్కూలులో శనివారం నిర్వహించిన వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఇచ్చిన మాట తప్పకుండా వంద శాతం హామీలు నెరవేర్చిన ఏకైక సీఎం భారతదేశంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఒక్కరే అని తెలిపారు. తుళ్లూరు మండలంలో 1,063 డ్వాక్రా సంఘాల్లోని 10,387 మంది సభ్యులకు ఆసరా ద్వారా మూడు విడతల్లో రూ.30.38 కోట్లు, నాలుగో విడతలో రూ.10.16 కోట్లు జమ చేస్తున్నారని వివరించారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే కుటుంబం అభివృద్ధి చెందుతుందని, తద్వారా గ్రామం, రాష్ట్రం కూడా అభివృద్ధి చెందుతాయని బలంగా నమ్మి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్ర ప్రజలు మనస్ఫూర్తిగా ఆశీర్వదించాలని సుచరిత కోరారు. జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా 2,86,000 మంది మహిళలకు రూ.987 కోట్లు అందించినట్లు చెప్పారు. ఇతర సంక్షేమ పథఖాలు, బ్యాంకు లింకేజీ రుణాలు, స్త్రీనిధి, చేయూత తదితర పథకాల ద్వారా రూ.290.55 కోట్ల ఆర్థిక లబ్ధి అందించినట్లు తెలిపారు. అనంతరం తుళ్లూరు మండలానికి సంబంధించి రూ.10,15,64,536 నమూనా చెక్కును మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు కొప్పుల శేషగిరిరావు, బత్తుల కిశోర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్రా వెంకట శివారెడ్డి, పార్టీ గ్రామ అధ్యక్షుడు ఆలోకం సురేష్, సొసైటీ అధ్యక్షుడు నాయుడు నాగేశ్వరరావు, మున్నంగి కోటిరెడ్డి, ఆలూరి శ్రీనివాసరావు, గాదె నాగేశ్వరరావు, దానం వినోద్, పార్టీ గ్రామ అధ్యక్షుడు చనుమోలు రామారావు, కొమ్మినేని దత్తు, పుట్టి సుబ్బారావు, ఐనవోలు చంటి, తుమ్మూరు ప్రసాదరెడ్డి, ఆరేపల్లి జోజి, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, నియోజకవర్గ ప్రత్యేకాధికారి, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ రవీందర్, మండల ప్రత్యేకాధికారి, బీసీ కార్పొరేషన్ ఈడీ దుర్గాబాయి, తహసీల్దార్ సుధీర్, ఎంపీడీఓ శివన్నారాయణ, ఏపీఎం చిన వీరయ్య పాల్గొన్నారు.



హాజరైన డ్వాక్రా మహిళలు, నాయకులు

మళ్లీ వైఎస్ జగన్‌ను సీఎంగా చేసుకుందాం

- పార్టీ సమన్వయకర్త గంజి చిరంజీవి
- పట్టణంలో గుడ్ మార్నింగ్ మంగళగిరి



సమస్యలు తెలుసుకుంటున్న గంజి చిరంజీవి

మంగళగిరి: అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి పిలుపునిచ్చారు. 'గుడ్ మార్నింగ్ మంగళగిరి' పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని 14వ వార్డు షరాఫ్‌బజార్‌లో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం కుల, మత, రాజకీయాలకు అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ ఐదేళ్లలో అభివృద్ధిని ప్రజలకు వివరించడంతో పాటు వారికి స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఇళ్లు లేని వారికి స్థలాలు కేటాయించి పట్టాలు అందజేస్తామన్నారు. ఎన్నో ఏళ్లుగా ఎన్నో ప్రభుత్వాలు పాలిస్తున్నా ప్రజల సంక్షేమం కొరకు పనిచేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో దుగ్గిరాల మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ బాజీ, పార్టీ నాయకులు ఎండీ ఫిరోజ్, ఆకురాతి రాజేష్, ఎం.సుధారాణి, బేతపూడి నరసయ్య, వి.నాగేశ్వరరావు, తోట శ్రీనివాసరావు, భవాని, గుంటి రాజ్యలక్ష్మి, నిర్మల, పూజల మనోహర్ పాల్గొన్నారు.

క్షతగాత్రులను ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత



వాల్‌పోస్టర్ అతికిస్తున్న ఆర్టీవో ప్రసాద్, ఎంవీఐ రాఘవరావు

తెనాలిరూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెనాలి ప్రాంతీయ రవాణా అధికారి కె.ప్రసాద్ అన్నారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన గుడ్ సమారిటన్ వాల్ పోస్టర్లను తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల, పట్టణంలోని ప్రైవేటు వైద్యశాలల్లో తెనాలి రవాణా శాఖ అధికారులు సోమవారం అతికించారు. ఈ సందర్భంగా ఆర్టీవో ప్రసాద్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి త్వరితగతిన వైద్య సహాయం అందించి ప్రాణాలు కాపాడాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. గాయాలపాలైన వారికి సహాయం అందించే వారిని ఉద్దేశించి గుడ్ సమారిటన్ వాల్ పోస్టర్లను రవాణా శాఖ రూపొందించిందని తెలిపారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని త్వరితగతిన వైద్యశాలకు తరలించిన వారికి రూ.ఐదు వేలు నగదు ఇస్తారని చెప్పారు. క్షతగాత్రులను వైద్యశాలకు తీసుకువచ్చిన వారిని ఫారాలు నింపాలని, వైద్య ఖర్చులు చెల్లించాలని ఒత్తిడి చేయకూడదని, వారిని వైద్యశాల నుంచి వెళ్లేందుకు అభ్యంతరం చెప్పకూడదని స్పష్టం చేశారు. బాధితులను ఆదుకున్న వారిని సాక్షులుగా ఉండాలని పోలీసులూ ఒత్తిడి చేసేందుకు వీలు లేదని, అవసరమైతే సాక్షిగా ఉండేందుకు అంగీకరిస్తారా అని వారిని అడిగి వారి సమ్మతంతోనే సాక్షిగా పోలీసులు చేరుస్తారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఏడాదికి 10 మంది గుడ్ సమారిటన్‌లను ఎంపిక చేసి ట్రోఫీ, సర్టిఫికెట్‌తో పాటు రూ.లక్ష నగదు ప్రోత్సాహంగా అందిస్తుందని తెలిపారు. ఆయన వెంట మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి.రాఘవరావు, సిబ్బంది ఉన్నారు.

అదనపు కమిషనర్‌గా రాజ్యలక్ష్మి బాధ్యతలు



నెహ్రూనగర్: నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా కె.రాజ్యలక్ష్మి సోమవారం బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన డెప్యూటీ కలెక్టర్ల బదిలీలో భాగంగా మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ వైస్ చైర్మన్‌గా విధులు నిర్వహిస్తున్న రాజ్యలక్ష్మిని గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సోమవారం రాజ్యలక్ష్మి నగర కమిషనర్ కీర్తి చేకూరిని కమిషనర్ చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి జాయినింగ్ రిపోర్ట్ అందించి విధుల్లో చేరారు. ప్రస్తుతం అదనపు కమిషనర్‌గా విధుల్లో ఉన్న లక్ష్మీశివజ్యోతి, ఓఎస్‌జీసీ, ఆర్‌ఓ, గోపాలపురానికి బదిలీపై వెళ్లారు.

మేయర్‌ను కలిసిన రాజ్యలక్ష్మి

అదనపు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాజ్యలక్ష్మి సోమవారం సంపత్ నగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో మేయర్ కావటి మనోహర్ నాయుడును కలిసి మొక్కను అందజేశారు.

స్పందన అర్జీలపై అశ్రద్ధ వద్దు

కమిషనర్ కీర్తి చేకూరి



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: స్పందనలో అందే ఫిర్యాదులు, అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించేలా విభాగాధిపతులు, నోడల్ అధికారులు చొరవ చూపాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో సోమవారం స్పందన నిర్వహించారు. తొలుత గత వారం అందిన అర్జీల పరిష్కారంపై ఆమె సమీక్షించారు. అర్జీలను విభాగాధిపతే నేరుగా పరిశీలించి పరిష్కరించాలని, సిబ్బంది నిర్లక్ష్యం ఉంటే చర్యలకు సిఫార్స్ చేయాలని ఆదేశించారు. నగరంలోని 206 వార్డ్ సచివాలయాల్లోనూ ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు స్పందన నిర్వహించాలని, కార్యదర్శులంతా ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఫిర్యాదులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌ను ఆయా విభాగాధిపతులు పరిశీలించాలని, విభాగాల వారీగా జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారానికి ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలని సూచించారు. సమస్య పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలని ఆదేశించారు.

ప్రజల నుంచి 40 ఫిర్యాదులు

సోమవారం నిర్వహించిన స్పందనలో 40 ఫిర్యాదులు అందాయని కమిషనర్ తెలిపారు. పట్టణ ప్రణాళిక విభాగానికి 15, ఇంజినీరింగ్ విభాగానికి 9, రెవెన్యూ విభాగానికి 6, ప్రజారోగ్య విభాగానికి 6, ఉపా సెల్ విభాగానికి 4 చొప్పున ఫిర్యాదులు అందాయన్నారు. నిర్దేశిత గడువులోగా వాటిని పరిష్కరించాలని అధికారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ కె.లక్ష్మీశివజ్యోతి, డెప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ సుందరరామిరెడ్డి, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, సీఎంఓహెచ్ డాక్టర్ డి.ఆషా, ఎంహెచ్ఓ మధుసూదన్, మేనేజర్ శివన్నారాయణ, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, డీసీపీలు, ఏసీపీలు, ఈఈలు, ఆర్ఓలు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి

తెనాలిరూరల్: తెనాలి రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే స్టేషన్‌లోని నాలుగు, ఐదు ప్లాట్‌ఫాంల మధ్య వ్యక్తి మృతి చెంది ఉన్నాడని వచ్చిన సమాచారంతో జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని సోమవారం పరిశీలించారు. సుమారు 50 నుంచి 60 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది పడి ఉన్నాడు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మరో ఘటనలో పెదవడ్లపూడి వద్ద పట్టాలు దాటుతున్న అదే గ్రామానికి చెందిన కె.వెంకటేశ్వర్లు(70)ను రైలు ఢీకొట్టడంతో ఇంజిన్‌లో ఇరుక్కుని ఆదివారం రాత్రి మృతి చెందాడు. దుగ్గిరాల వద్దకు వచ్చాక లోకో పైలట్ గమనించి మృతదేహాన్ని ఇంజిన్ నుంచి దింపారు. తెనాలి జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహా శివరాత్రి ఏర్పాట్లపై పాలకమండలి సమావేశం

పెదకాకాని: శివాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ధర్మకర్తల మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు తెలిపారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం ధర్మకర్తల మండలి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినంలో క్యూలైన్లు, వసతులు, స్వామివారి కల్యాణం, రథోత్సవం, తెప్పోత్సవం, అన్నప్రసాద వితరణ, భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లపై చర్చించి తీర్మానం చేశామన్నారు. 2024 జనవరి నెల ఆలయ జమా ఖర్చులకు ఆమోదం తెలిపినట్లు ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

వాలీబాల్‌లో రాష్ట్రస్థాయిలో సత్తాచాటాలి



క్రీడాకారులను అభినందిస్తున్న దొంతిరెడ్డి వేమారెడ్డి

తాడేపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా పోటీల్లో వాలీబాల్ క్రీడాకారులు సత్తాచాటాలని వైఎస్సార్ సీపీ ఎంటీఎంసీ అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి ఆకాంక్షించారు. ఇటీవల నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా పోటీలలో మంగళగిరి నియోజకవర్గం నుంచి వాలీబాల్ రాష్ట్రస్థాయికి ఎంపిక జట్టు సభ్యుల అభినందన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ, సచివాలయాల పరిధిలో క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని చెప్పారు. అనంతరం క్రీడాకారులకు వాలీబాల్ కిట్, షూస్ అందజేశారు. కార్యక్రమంలో పీడీలు రమేష్, సాంబశివరావు, పీఈటీలు రజని నాయక్, రవి పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు వ్యవధిలోగా పరిష్కారం

సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్



తెనాలి: వివిధ సమస్యలపై ప్రజలు స్పందనలో ఇచ్చే వినతిపత్రాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి, నిర్ణీత వ్యవధిలోగా పరిష్కారానికి కృషిచేస్తామని తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్ చెప్పారు. సోమవారం తన కార్యాలయంలో జరిగిన స్పందన సమావేశంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మధ్యాహ్నం వరకు జరిగిన స్పందనలో డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తొమ్మిది సమస్యలపై అర్జీలను అందజేశారు. సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్ ప్రతి అర్జీదారుని స్వయంగా పలకరించి, సమస్య వివరాలను తెలుసుకున్నారు. నిబంధనల ప్రకారం పరిష్కరిస్తామని చెప్పారు. రెవెన్యూకు సంబంధించి ఐదు, పోలీసుశాఖ పరిధిలో మూడు, మున్సిపాలిటీకి చెందిన సమస్య ఒకటి చొప్పున మొత్తం తొమ్మిది అర్జీలు వచ్చాయని వివరించారు. ఓటర్లు తమ ఓటుకు సంబంధించి మార్పులు, చేర్పులకు ఇప్పటికీ అవకాశం ఉందని సబ్‌కలెక్టర్ ప్రత్యేకంగా చెప్పారు. ఏవైనా మార్పులు, చేర్పులు అవసరమైనవారు సంబంధిత బీఎల్‌ఓలను సంప్రదించాలని సూచించారు.

ఆర్‌వీఆర్‌జేసీలో రాష్ట్రస్థాయి టెక్నికల్ పోటీలు

గుంటూరు రూరల్: టెక్నాలజీ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా నూతన ఆవిష్కరణలు చేస్తూ, అందులో ఎదురయ్యే సమస్యల పరిష్కార సవాళ్లను అధిగమించేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉండాలని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో రాష్ట్రస్థాయి టెక్నికల్ పోటీలు టెక్నిజెన్ పేరుతో ప్రారంభించారు. రెండురోజుల పాటు నిర్వహించే ఈ పోటీలలో మొదటిరోజు ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతిక నైపుణ్యతను అందిపుచ్చుకుని లక్ష్యసాధన దిశగా కృషిచేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటువంటి పోటీల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లోని విజ్ఞానాన్ని మెరుగుపరుచుకోవచ్చని సూచించారు. సాంకేతిక నైపుణ్యాలు మెరుగు పరుచుకోవటం ద్వారా ఉద్యోగ అవకాశాలకు దోహదపడతాయని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న ఈ టెక్నికల్ పోటీల్లో వివిధ కళాశాలల నుంచి 1,500 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారని, తొలిరోజు జరిగే 'సి జావా', 'పైథాన్' విభాగాల్లో విద్యార్థులు ప్రతిభ అభినందనీయమని తెలిపారు.